క్లుప్తంగా

జాతీయ విద్యావిధానంతో మంచి ఫలితాలు

మదనపల్లె సిటీ : జాతీయ విద్యా విధానం అమలుతో మంచి ఫలితాలు వస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. శనివారం స్థానిక నవోదయ విద్యాలయ ఆడిటోరియంలో జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ–2020) మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని టీవీ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు వీక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, వెంకటరమణ,విద్యార్థులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె ఎస్ఐగా లోకేష్‌రెడ్డి



తంబళ్లపల్లె : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా లోకేష్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన మదనపల్లె టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చా రు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన శోభారాణి బదిలీపై మదనపల్లె టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి



ఆర్టీసీ బస్టాండులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫోర్సు సభ్యులు

మదనపల్లె సిటీ : ప్రయాణికులందరూ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని ఫోర్సు డైరెక్టర్ లలితమ్మ తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫోర్సు సిబ్బంది పద్మావతి, రాధారాణి, నరసింహులు, రెడ్డమ్మ, అనిత, భువనేశ్వరిలు పాల్గొన్నారు.

కార్మికులు వివరాలు నమోదు చేసుకోవాలి

కలికిరి : ప్రమాదవశాత్తు గాయపడిన, మరణించిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాన్ని ఆదుకోవడమే లక్ష్యంగా హెచ్ఎస్ఎం స్వచ్ఛంద సంస్థను స్థాపించినట్లు ఎంపీటీసీ సభ్యుడు భోగేష్ తెలిపారు. వచ్చే నెల 5వ తేదీ లోపు ఇందిరమ్మకాలనీలోని సంస్థ కార్యాలయంలో వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి



గుర్రంకొండ మండలం ఎల్లుట్ల అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న పీడీ ధనలక్ష్మి

గుర్రంకొండ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ఎల్లుట్ల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రక్తహీనత ఉన్న గర్భిణుల పట్ల ప్రత్యే శ్రద్ధ చూపించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మీ, సిబ్బంది శాంతమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి విశేష పూజలు

కేవీపల్లె : మండలంలోని నారమాకులవడ్డిపల్లె సమీపంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా అభయ ఆంజనేయస్వామి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శనివారం అభయ ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించి అలంకరించారు. భక్తుల కాలక్షేపానికి భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో ఆలయంలోని స్వామివార్లకు విశిష్టమైన పూజలు జరిపారు. ఉదయాన్నే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో తోమాల సేవ, ఏకాంతసేవ చేపట్టారు. స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు.

ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం : స్థానిక తరిగొండ రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ మంజుల తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9866559649 నంబరులో సంప్రదించాలని ఆమె సూచించారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో శనివారం మొహర్రం పండుగను కుల మతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పీర్ల చావిడిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పీర్ల చావిడి ముందు అగ్నిగుండ ప్రవేశం చేశారు. రాత్రి పీర్లను భక్తజన సందోహం మధ్య ఊరేగించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల ప్రజలు తరలివచ్చారు.

- భక్తిశ్రద్ధలతో మొహర్రం పండుగ
- కులమతాలకు అతీతంగా ప్రత్యేక ప్రార్థనలు
- భారీ భక్తజనం మధ్య పీర్ల ఊరేగింపు



కలకడ:అగ్రహారంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



కేవీపల్లెలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

మదనపల్లె సిటీ : స్థానిక నెహ్రూబజార్‌లోని తాటిమాన్ల చావిడి వద్ద షాహిషావల్లి, ఇమామ్‌హుస్సేన్ల పీర్లను ప్రత్యేకంగా అలంకరించి మకాన్‌దార్ అమీన్, దాదులు ప్రార్థనలు చేశారు. పీర్ల చావిడి ముందు అల్లాహ్ (అగ్నిగుండం) వేశారు. దీని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. హిందూ, ముస్లింలు పీర్ల వద్ద చక్కెర, తీపి పదార్థాలతో చదివింపులు చేశారు. స్థానిక సంతబజారువీధి వద్ద జల్ది(నిమజ్జనం) కార్యక్రమం నిర్వహించారు.

త్యాగానికి ప్రతిరూపం

రామసముద్రం : త్యాగానికి, మానవ విలువలకు ప్రతిరూపమైన మొహరం వేడుకలు శనివారం మండల కేంద్రంలోని రామసముద్రం, ఆర్.నడిపల్లె గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి నిర్వహించిన అగ్నిగుండంలో ప్రవేశం చేసి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. మొహర్రం ప్రారంభమైన రోజు నుంచి మూడు, ఏడు , తొమ్మిది రోజులలో పీర్లను పురవీధులలో ఊరేగింపు చేసి పదవ రోజు మండల కేంద్రంలోని దిగువపేటలో ఉన్న మైదానంలో మిలాఖత్ చేయడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ మిలాఖత్‌లో మూడు తాబూతులు ఒక చోట కలవడంతో తండోపతండాలుగా హిందు, ముస్లింలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆషూర ప్రార్థనలు

వాల్మీకిపురం : పట్టణంలోని షియా తెగకు చెందిన ఇరానీ ముస్లింలు శనివారం ఆషూర ప్రార్థనలను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. మొహరం పండుగను పురస్కరించుకొని స్థానిక ఇమామ్ బాడాలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మహా ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్ కుటుంబీకులు కర్బలాలో జరిగిన ధార్మిక యుద్ధంలో అమరులైన సంఘటనను పురస్కరించుకొని ఇరానీ ముస్లింలందరూ నల్ల దుస్తులను ధరించి ఇమామ్ బాడాలో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మొహరం నెల 10వ తేదీన హజరత్ ఇమామ్ హుస్సేన్ అమరులైన నేపథ్యంలో ఆషూర ప్రార్థనలు నిర్వహించి, ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం కత్తులు, బ్లేడ్లతో ఎదలను బాదుకుంటూ యా హుస్సేన్ యా హసన్ అంటూ నినదిస్తూ ఆలంల ప్రదర్శన నిర్వహించారు. ఇమామ్ బాడాలో జరిగిన ఆషూర ప్రార్థనలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, సయ్యద్ ఖాసిం అబ్బాస్, అమీర్ అలీ, అర్షాత్ హుస్సేన్, సమీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లెలో..

కేవీపల్లె : శనివారం మండలంలోని కేవీపల్లె, గుర్రెడ్డిగారిపల్లె, గర్నిమిట్ట, లక్ష్మీరెడ్డిగారిపల్లె, తిమ్మాపురం, గోరంట్లపల్లె, చీనేపల్లె, నూతనకాల్వ, మార్టేళ్ల తదితర గ్రామాల్లో మొహరం పండుగ చేసుకున్నారు. గ్రామాల్లోని పీర్ల చావిడిలో పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పీర్లను వైభవంగా ఊరేగింపు చేపట్టి అగ్నిగుండ ప్రవేశం చేశారు. పలువురు హిందూ, ముస్లింలు పాల్గొన్నారు.

కలకడలో..

కలకడ : మండలంలోని కలకడ, కోన, దేవళంపేట, అగ్రహారం గ్రామాలలో పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. పీర్ల ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పీర్ల జల్ది కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొన్నారు.



మదనపల్లెసిటీ:ప్రత్యేక అలంకరణలో పీర్లు



రామసముద్రం: దిగువపేటలో బాబయ్యపీర్ల మిలాఖత్



వాల్మీకిపురం:ఇమామ్ బాడాలో ప్రార్థనలు చేస్తున్న ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ఘనంగా పీర్ల పండుగ



పీలేరు:జెండామాను వద్ద కొలువుదీరిన పీర్లు

పీలేరు : స్థానిక జెండామాను, శివాలయం వీధి, మోడల్ కాలనీ, బోడుమల్లువారిపల్లెలో పీర్లను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు పీర్ల వద్ద చదివింపులు చేశారు. సాయంత్రం పీలేరు పట్టణంలో మంగళవాయిద్యాల నడుమ పీర్ల ఊరేగింపు నిర్వహించారు. జెండామాను వద్ద పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేపట్టారు. ఈ కార్యక్రమంలో హిందూ, ముస్లింలు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం దురాక్రమణపై విచారణ



అరికెల ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయవాది రవిశంకర్ , కమిషనర్ నవీన్

రామసముద్రం : రామసముద్రం మండలం అరికెల జెడీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాలకు కేటాయించిన స్థలం దురాక్రమణకు గురైందని ఫిర్యాదుపై శనివారం హైకోర్టు న్యాయవాది రవిశంకర్, కమిషనర్ నవీన్ గ్రామంలో విచారణ చేపట్టారు. అరికెల గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన సర్వే నెంబరు 246/1లో 0.77ఎ, 247/4లో 0.60ఎలో కొంత స్థలం దురాక్రమణ చేసి గృహ నిర్మాణం చేపట్టారని గ్రామానికి చెందిన చంద్రమోహన్‌రెడ్డి గతంలో విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నాలుగు నెలల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విచారణకు ఆదేశించింది. విచారణ అనంతరం నివేదికను హైకోర్టుకు సమర్పించనున్నట్లు కమిషనర్ నవీన్ తెలిపారు. ఈ విచారణలో డీవైఈఓ కృష్ణప్ప, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈఓ హేమలత, సర్వేయర్ నాగరాజ, వీఆర్ఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మసత్రం స్థలాన్ని ప్రజోపయోగానికే వినియోగించాలి



మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ జి.ముజీబ్‌హుస్సేన్

మదనపల్లె : పట్టణంలో ప్రజల ఉపయోగార్థం 1934లో జోగప్పగారి వెంకటప్ప అలియాస్ కుశలప్ప ధర్మసత్రానికి వితరణగా చేసిన స్థలాన్ని ప్రజోపయోగానికే వినియోగించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ ముజీబ్‌హుస్సేన్ కోరారు. శనివారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... జోగప్పగారి వెంకటప్ప తనకు దాఖలాపడిన సర్వే నంబర్ 200లో సత్రము నిర్మించేందుకు రాటకొండ గోవిందప్ప ఒప్పుకున్నందున దానపత్రము రాయించి రిజిస్టర్ చేశారన్నారు. అందులో పడమర దిక్కున రోడ్డును కనబరుస్తూ, ఆ రోడ్డు గాంధీరోడ్డు నుంచి మైకావీధికి రాకపోకలకు చూపారన్నారు. అలాగే సత్రం జాగాకు ఆనుకుని ఉత్తరదిక్కున జోగప్పగారి వెంకటప్ప విక్రయించిన స్థలంలోనూ పడమర దిక్కున దారి చూపారన్నారు. ఈ విషయాలన్నింటినీ పక్కన పెట్టి పట్టణానికి చెందిన మహబూబ్‌బాషా, అబ్దుల్‌బాషాలు రాటకొండ గోవిందప్ప వారసులైన రాటకొండ రవి నుంచి 16.6.2008న తప్పుడు పత్రం సృష్టించుకుని రోడ్డు, సత్రం స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఈ దారి విషయమై మైకావీధి ప్రజలు మదనపల్లె జూనియర్ సివిల్‌జడ్జికోర్టులో దావా దాఖలు చేసి రాకపోకలకు ఆటంకం కలిగించవద్దని ఉత్తర్వులు పొందారన్నారు. 1934 దాన దస్తావేజు ప్రకారం మైకావీధిలో జోగప్పగారివెంకటప్ప దానం చేసిన ఆస్తి ప్రజా ఉపయోగార్థం సత్రం లేదా ఇతర ప్రజోపయోగ కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ స్థల విషయమై పలువురు ప్రజాసంఘాల నాయకులు ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు సమర్పించారని, అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి మైకావీధి ప్రజల దారి సమస్యను పరిష్కరించాలని కోరారు.

మల్లయ్యకొండలో న్యాయమూర్తి దంపతుల పూజలు



పూజా కార్యక్రమంలో న్యాయమూర్తి చంద్రశేఖర్‌రెడ్డి, కుటుంబీకులు

తంబళ్లపల్లె : అనంతపురం జిల్లా తాడిపత్రి జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయమూర్తి చంద్రశేఖర్‌రెడ్డి, సతీమణి చంద్రకళ వారి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మల్లయ్యకొండను సందర్శించారు. ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, కొండకిట్టా, పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు న్యాయమూర్తి దంపతులకు స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గౌరమ్మగట్టులోని గౌరమ్మతల్లికి ప్రత్యేక అభిషేకాలు, పూజలతో న్యాయమూర్తి దంపతులు మొక్కులు తీర్చుకున్నారు.

మనిషి జీవితంలో యవ్వనకాలం కీలకం



మాట్లాడుతున్న దైవసేవకుడు మంజిత్ పాల్

కురబలకోట : మనిషి జీవితంలో యవ్వన కాలం కీలకమైనదని కర్ణాటక రాష్ట్రం బీదర్ దైవ సేవకుడు మంజిత్ పాల్ ఉద్బోధించారు. కురబలకోట మండలం అంగళ్లులోని సీయోను మందిరంలో మదనపల్లె డివిజన్ స్థాయిలో శనివారం యవ్వనస్థుల కూడిక నిర్వహించారు. ముఖ్య వక్తగా ఆయన మాట్లాడుతూ యవ్వన కాలంలో తాత్కాలిక ఆకర్షణలకు, దురలవాట్లకు గురి కాకుండా భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. చదువు భవిష్యత్తుకు చక్కని మార్గాన్ని నిర్దేశిస్తుందన్నారు. దేవుని యందు భయభక్తులు సన్మార్గానికి చుక్కానిలా పని చేస్తాయన్నారు. విక్టర్, ఇశ్రాయేలు, దేవదానం, ఏలియా, శామ్యూల్, జయరాజ్‌రెడ్డి, బర్నబాసు, భాస్కర్, జాన్, నాతాను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణ పనులు సెప్టెంబరులోపు పూర్తి చేయాలి

పీలేరురూరల్ : నియోజకవర్గంలో జరుగుతున్న ప్రభుత్వ భవన నిర్మాణ పనులు సెప్టెంబరు లోపు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డీఈ టి. భాస్కర్ అన్నారు.

శనివారం పట్టణంలోని వెలుగు కార్యాలయం వద్ద కావలిపల్లె గ్రామ సచివాలయం, వైఎస్సార్ క్లినిక్ నిర్మాణ పనులు పరిశీలించారు. నియోజకవర్గంలో 81 గ్రామ సచివాలయాలకు గాను 54 పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేలు 73కు 42 పూర్తి అయ్యాయని, అలాగే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు 53కు 29 పూర్తి అయినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ సి.కె. యర్రమరెడ్డి, జేఈలు తేజేశ్వర్ రెడ్డి, మహేంద్రనాయక్ పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణపై మాట తప్పిన బీజేపీ

బి.కొత్తకోట : ఎస్సీల వర్గీకరణపై తొమ్మిదేళ్ల క్రితం హామీ ఇచ్చిన బీజేపీ మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కేఎన్ రాజు మాదిగ అన్నారు. శనివారం బి.కొత్తకోటలో ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఎస్సీల వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి తప్పిందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి దుమ్ముచిన్నా, జిల్లా కార్యదర్శి భవానీ వెంకటేష్, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ పక్కాగా నిర్వహించాలి

ములకలచెరువు : ఓటర్ల జాబితా సవరణ పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాసులు బీఎల్ఓలను ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితా రూపకల్పనలో బీఎల్ఓల పాత్ర కీలకమని చెప్పారు.

1న రామాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన

మదనపల్లె సిటీ : పౌర్ణమి పురస్కరించుకుని ఆగస్టు 1న రామాంజనేయయుద్ధం నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు వీరాంజనేయ కళామండలి అధ్యక్షుడు చంద్రప్పనాయుడు, శీలం మల్లయ్య తెలిపారు. చిత్తూరు దగ్గర అరగొండ ఆంజనేయస్వామి ఆలయంలో ఈ ప్రదర్శన ఉంటుందన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



రేషన్ కార్డును అందిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టనన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి కుటుంబానికీ ఏడాదికి రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకూ ఆర్థిక వెసులుబాటు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను శనివారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి అందించాలనే ధ్యేయంతో మండల వ్యాప్తంగా 540 రేషన్ కార్డులను మంజూరు చేశారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి శ్రీరామ రక్ష అని, 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రవి నాయక్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, మండల పార్టీ అధ్యక్షుడు నీళ్లభాస్కర్, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు శ్రీధర్ రాయల్, లక్ష్మీనారాయణ శెట్టి, లక్ష్మన్న, మహబూబ్‌బాషా, షాహెద్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికుల యువజన కార్యవర్గం ఎన్నిక



అన్నమయ్య జిల్లా పత్రికుల యువజన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న కులపెద్దలు

మదనపల్లె : అన్నమయ్య జిల్లా పత్రికుల యువజన కార్యవర్గ ఎన్నిక శనివారం మదనపల్లెలో జరిగింది. అన్నమయ్య జిల్లా పత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపోతుల హనుమంత్ సమక్షంలో యువజన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జల ఈశ్వర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శిగా పెండే రిభార్గవనాయుడు, కోశాధికారిగా ఇట్నేని నరేష్ నాయుడు, ఉపాధ్యక్షుడిగా ఇట్నేని రెడ్డెప్పనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జల్లా సతీష్ నాయుడు, కార్యనిర్వాహక సభ్యులుగా నవీన్‌నాయుడు, జంగాల విజయ్‌కుమార్ నాయుడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపోతుల హనుమంత్ మాట్లాడుతూ ఓసీ జాబితాలో ఉన్న తమ కులాన్ని బీసీ–ఏ జాబితాలోకి చేర్చి న్యాయంచేసిన ఘనత మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ రిజర్వేషన్ ద్వారానే తమ కులంలో ఎందరో సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలుగా ఎన్నికయ్యేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరనాయుడు, ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు రామాంజి, ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా సునీల్‌కుమార్, రామనాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎన్జీఓ అసోసియేషన్ మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బి.వి. రాఘవులు

పీలేరు రూరల్ : ఆగస్టు 21, 22 తేదీలలో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర ఎన్జీఓ అసోసియేషన్ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వి. రాఘవులు కోరారు. శనివారం స్థానిక పీలేరు డివిజన్ ఎన్జీఓ హోమ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగే 21వ రాష్ట్ర ఎన్జీఓ మహాసభలకు నాన్ గెజిటెడ్ ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ కె. రఘు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రదీప్, జాయింట్ సెక్రటరీ కె. రమేష్, డివిజన్ అధ్యక్షుడు వై. రెడ్డెప్పనాయుడు, జనరల్ సెక్రటరీ కె. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరికోటకు తరలి వెళ్లిన 19 బస్సులు

పీలేరురూరల్ : శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ వీక్షించేందుకు పీలేరు డిపో పరిధి నుంచి 19 ప్రత్యేక సర్వీసులు తరలివెళ్లినట్లు డీఎం కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం పీలేరు నుంచి 9, కందూరు నుంచి 2, కలికిరి నుంచి 3, కలకడ నుంచి 3, కేవీపల్లె నుంచి 1, అంగళ్లు నుంచి 1 సర్వీసులు తరలి వెళ్లాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాకెట్ లాంచింగ్ తోపాటు నేలపట్టు, సైన్స్‌సెంటర్, జూపార్క్, వివిధ సందర్శన ప్రాంతాలు చూపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, బస్‌స్టేషన్ మేనేజర్ బాబునాయక్, ఏడీసీలు రెడ్డెప్ప, యల్లయ్య, మార్కెటింగ్ టీమ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం



బి.శ్రీధర్ రెడ్డి
అధ్యక్షుడు



కె.రమేష్ కుమార్ రెడ్డి
కార్యదర్శి



పి.సూర్యప్రకాష్ రెడ్డి
ట్రెజరర్

కలికిరి : లయన్స్‌క్లబ్ కలికిరి శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన శాఖ ప్రెసిడెంట్‌గా బి.శ్రీధర్ రెడ్డి, కార్యదర్శిగా కె.రమేష్ కుమార్‌రెడ్డి, ట్రెజరర్‌గా టి.సూర్యప్రకాష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా జి.గంగిరెడ్డి, ఎం.వెంకటరమణ, క్రాస్‌రోడ్డు మధు, ఎన్.మల్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, భానుప్రకాష్ రెడ్డిలను ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన లయన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, లయన్ భానుమూర్తిరెడ్డిలు మాట్లాడుతూ నూతన కార్యవర్గం మండలంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా ప్రతినిధులు లయన్ భక్తవత్సల రెడ్డి, లయన్ సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.